# అమ్మ

రచన:
శ్రీ. పి. భాస్కర్

నిర్మలకు ఈ లోకంలో నా అనే వాళ్లెవరూలేరు, యిద్దరు పసిపిల్లలు తప్ప. ఆమె నివాసం ఊరిబయట పూరి గుడిశెలో. ఆ గుడిశె కూడా శిథిలావస్థలో వుంది. వేసవికాలం ఎండ అంతా గుడిశెలోనే వుంటుంది. వర్షాకాలం ఇక చెప్పనే అక్కరలేదు. కురిసిన వర్షమంతా ఆ గుడిశె పరమే అవుతుంది. ఆ పూరిగుడిశే కష్టంలోనూ, సుఖంలోనూ, ఆమెకు ఆశ్రయమిస్తూ, కాపాడుతూంది. అదే ఆమెకు ఇల్లు; అదే ఆమెకు భవనం కూడా.

భర్త బ్రతికి వున్నప్పుడు. ఇంద్ర భోగాలు అనుభవించక పోయినా, "దేహి" అని ఒకళ్ల దగ్గర చేయి చాపకుండా గడచి పోయింది. మాయదారి కలరా వచ్చింది, రాయిలాంటి భర్తను పొట్ట బెట్టుకుంది. ఏ మంచీ, చెడ్డా చెప్పకుండానే నిర్మలను ఒంటరి దాన్ని జేసి "ఆయన" కాస్తా కళ్లు మూసేడు. భర్త పోవడంతో రెక్కలు నరికిన పక్షి అయిపోయింది నిర్మల. పైగా పసి పిల్లల పెంపకం కూడా తన నెత్తినే పడడంతో మరీ కృంగి పోయింది, వాళ్లు ఏమయి పోతారో అన్న భయంతో.

ఉన్న నగలూ - నట్రా మార్చి కొంత కాలం ఎలాగో నెట్టేసింది. అవి మాత్రం ఎంత కాలం ఆగుతాయి? కూర్చుని తింటుంటే, కొండ లయినా తరిగిపోతాయి. ఇక జీవనోపాధికి మార్గం వెతకాల్సి వచ్చింది. పూలు మోసిన చోటనే కట్టెలు మోయడం కష్టం కనుక ప్రక్క వూరుకు మకాం మార్చింది నిర్మల.

ప్రక్క వూళ్లో వూరి చివర చిన్న పాక వేసుకుని వుంటూంది. ఉదయాన్నే లేచి, ఇంటి పనులు చక్కబెట్టుకుని, ఇద్దరి పిల్లల్నీ వెంట వేసుకుని, బిచ్చానికి బయలు దేరేది. కష్ట సుఖాలు తెలిసి, దయాధర్మ గుణాలు కలవారు, కనికరించి కొంచెం బిచ్చం వేసేవారు. లేనివారు లేదు. కొంత మంది హేళన కూడా చేసేవారు—"వయసులో వున్నావు, పని చేసుకోలేవా?" అని. కొంత మంది ఆమె అందరివైపు యౌవనంవైపు తృష్ణతో అదోలా చూసేవారు. అవమానాన్ని సహిస్తూ, సాయంకాలం వరకూ అలాగే వూరంతా తిరిగి, బిచ్చమెత్తుకుని, సాయంత్రం గుడిశెకు చేరుకునేది. ఆ రోజు వచ్చిన బియ్యం వండి, పిల్లలకు పెట్టి, తాను కూడా కొంచెం తిని, ఇద్దరి పిల్లలనూ చెరో ప్రక్కనా వేసుకుని నిద్రపోయేది. రోజులు ఒక్కలాగే వెడుతున్నాయి. జీవితంలో ఏ మార్పూలేదు. ఏ ఆనందం లేదు, నిత్యమూ "లేమి" తో పోరాడడం. కష్టాలను ధైర్యంతో ఎదుర్కోవడం. ఆత్మాభిమానాన్ని దరిద్ర దేవతకు బలిచేయడం. ఇదీ ఆమె దినచర్య.

## 2

ఆ రోజు సాయంకాలం వరకూ తిరిగినా, నిర్మలకు ఏ యింటి దగ్గరా పిడికెడు బియ్యం దొరకలేదు. దేశంలో వ్యాపించిన కరువు కారణంగా ఓ నెల రోజులనుంచీ ఆమెకు సరిపడ్డ బిచ్చం దొరకడంలేదు. ఇప్పటికే చాలా అలసి పోవడంచేత, నడుస్తుంటే కాళ్లు కూడా తడబడుతున్నాయి. ఎండలో తిరిగి తిరిగి గొంతు ఎండిపోయింది. అయినా అలాగే ఎదురుగా కనుపిస్తున్న బంగళా వైపు నడచింది—ఆశాపూరిత హృదయంతో.

బంగళా గేటుముందు ఓ అందమైన కారు ఆగివుంది. లోపలి నుంచి ఇద్దరు యువతులు కారు దగ్గరకు వచ్చేరు. వాళ్లు కట్టుకున్న పట్టు చీరెలూ, పెట్టుకున్న నగలూ చూసి ఎవరైనా చెప్పొచ్చు—వాళ్లు చాలా ధనవంతులని. "ప్రొద్దుట నుంచీ పిల్లలు గంజి కూడా త్రాగలేదు; పిడికెడు అన్నం పెట్టించండి, తల్లీ! పుణ్య ముంటుంది." అంది జాలి గొలిపే గొంతుతో నిర్మల.

"పో, ఇక్కడ నుంచి. అలా మీద మీద కొస్తావేం? ముట్టుకో గలవు! దూరంగా పో. ఏమే విమలా! గూర్ఖా వాడే మయ్యాడు? అడ్డ మయిన వాళ్లూ లోపలి కొస్తు

న్నారు.'' కోపంతో కనుబొమలు ముడి పడ్డాయి. అందులో ఒకామెకు.

అవమానంతో కృంగిపోయింది నిర్మల. బిచ్చకత్తె అయినా, అందరి మానవుల్లాగే ఆమెకూ హృదయం వుంది ; ఆత్మా వుంద—అందరిలాగే ఆమెలోనూ ప్రేమ, స్నేహం, దయ, మమత, మోహం మొదలయిన వన్నీ వున్నాయి. అంతేకాదు ; ఆ దీన హృదయంలో వింత వింత ప్రశ్నలు కూడా వేస్తుంటాయి—భర్త లేని స్త్రీ బిక్షగత్తె అయితే, ఆ భర్తను భగవంతుడు నా నుండి ఎందుకు దూరంచేసేడు? పేదతనమే హేయమైనదయితే, అసలు పేదతనాన్ని ఎందుకు సృష్టించాడా దేముడు ? నాకూ, నా పిల్లలకూ సహాయం చేయలేనప్పుడు, నన్ను నిందించడానికి అధికారమేముందీ ప్రపంచానికి ? అసలెవరిచ్చారీ అధికారం ? మనిషి నయ్యుండీ కూడా నేను అస్పృశ్య నెలా అయ్యాను?—ఇటువంటి ప్రశ్నలలో గంటలకొలదీ సతమత మయ్యేదా నిర్మల, చివరికి ఈ ఆలోచనల నన్నింటినీ తనలోనే అణచుకో వలసి వచ్చేది. ఆమె వ్యధను అర్థంచేసుకునే వాళ్లీ ప్రపంచంలోనే లేరు. ఎందుచేతనంటే, ఆమె నిరుపేద, ఒక బిచ్చకత్తె, అందరూ ఆమెను "బిచ్చగత్తె" అని పిలచే వాళ్లు ; బిచ్చమెత్తుకోవడమే ఆమె జీవనోపాధి.

యువతిని చూస్తూ ప్రక్కకు తొలగిపోయింది నిర్మల. ఇంతలో రెండవ యువతి ప్రశ్నించింది, పరిహాసంగా—
''బిచ్చమెత్తుకుంటున్నావా, ఇద్దరు పిల్లలా నీకు ?''

''అవునమ్మా, ఇద్దరు పిల్లలు !'' మోడువారిన ఆశ మళ్ళీ చిగురించింది, నిర్మల మనసులో.

''తినడానికి కూడు లేనప్పుడు, పిల్లల్ని కనడానికెందు కెళ్ళావు ?''

శూలంతో వక్షంలో పొడిచినట్లైంది నిర్మలకు, బాధతో కుమిలిపోయింది, అవమాన భారంతో కృంగిపోయింది, తల వంచుకుని ప్రక్కకు తొలగిపోయింది ఆమె. ఒక బిచ్చగత్తె ఇంకేం చేయగలదు, ప్రక్కకు తొలగిపోవడం కంటే ?

## 3

ఎండుటాకులు ప్రోగుచేసి నిప్పు అంటిస్తున్న నిర్మలకు సుబ్బమ్మ పిలుపు వినిపించింది—"చూడమ్మాయీ! ఇవన్నీ నీకు ఇమ్మని రాంబాబు పంపించేడు''

"ఏం, మాటి మాటికీ నన్నూ నా పిల్లల్నీ అవమానించడానికి వస్తున్నావు ? ఒక్కసారి చెబితే చాలదూ ? వెళ్లు—నీ సామాను నువ్వు తీసుకుపో.''

''ఇదుగో అమ్మాయి ; నువ్వు చిన్న పిల్లవు ; దూరాలోచన తక్కువ, తరువాత నువ్వే బాధపడాల్సి వస్తుంది, నాకు తెలుసు. తిండి తినకుండా ఎన్నాళ్లు బ్రతకగలవు ? నువ్వే చెప్పు, బిచ్చమెత్తుకుంటూ ఎంతకాలం జీవించగలవు ? పైగా ఇద్దరు పసిపిల్లలున్నారాయె ? కనీసం వాళ్ల సంగతయినా ఆలోచించాలా ? ........రాంబాబు ఎంత డబ్బున్నవాడో నీకు తెలుసు కదా ; అతను తలచుకుంటే ఏమయినా చేయగలడు. నువ్వు చాలా అదృష్టవంతురాలనే చెప్పాలి, అతను నిన్నే కోరుకోవడం, నువ్వు "ఊ''అంటే చాలు, పెద్ద బంగళాలో వుండొచ్చు, కార్లలో తిరగొచ్చు, నౌకర్లు, చాకర్లు, ఒకటేమిటి ? ఏం చేయడానికయినా సిద్ధంగా వున్నాడు, ముఖ్యంగా నీ ఇద్దరు పిల్లలూ పెద్ద చదువులు చదువుకొని గొప్ప వాళ్లు కావడానికి చాలా అవకాశాలున్నాయి.'' అంటూ ఉపన్యాసమిచ్చింది, శుభాకాంక్షి సుబ్బమ్మ.

''నువ్వు వెళ్లిపో, నేను పిల్లలను పడుకోబెట్టాలి ;'' అని, సుబ్బమ్మ తీసుకువచ్చిన పెద్ద సంచీ బయటకు నెట్టి తలుపు గడియబెట్టింది నిర్మల.

ఏమో సణుక్కుంటూ సుబ్బమ్మ వెళ్లిపోయింది.

## 4

నిర్మల కూర్చొని, ఏమేమో ఆలోచిస్తూంది. పసిపిల్లలు ఆకలి మంటలతో అలమటిస్తున్నారు, వాళ్ల క్షుదార్తి తను తీర్చలేని స్థితిలో వుంది. వాళ్ళబాధ తన హృదయాన్నే కలచి వేస్తూంది. చైతన్యం విహీనంతో వింటూవుంది నిర్మల.

"అమ్మా, ఆకలేస్తోందమ్మా."

"నీ కాళ్లకు దణ్ణంపెడతా, కొంచెం అన్నం పెట్టమ్మా."

"అమ్మా, అమ్మా, మాట్లాడవే అమ్మా."

"వినిపించుకోవే అమ్మా, కడుపుమండి పోతూంది. కొంచెం గంజి అయినా ఇవ్వవే; అమ్మా......"

"ఈ అకలితో చచ్చిపోయేలా వున్నానమ్మా..."

"అమ్మా...."

ఎవరో గుండెల్లో చేయిపెట్టి కలచి వేస్తున్నట్లుగా వుంది నిర్మలకు. ఓప్రక్క సుబ్బమ్మ చెప్పివెళ్లినమాటలు చెవిలో ప్రతి ధ్వనిస్తున్నాయి. "రాందాబు ఎంత డబ్బున్నవాడో నీకు తెలుసు కదా!........నువ్వు "ఊ" అంటేచాలు......బంగళా......కారు...... ముఖ్యంగా నీ పిల్లలు పెద్ద చదువులు చదువుకొని గొప్పవాళ్లు కావడానికి చాలా అవకాశాలున్నాయి."

"అమ్మా...ఆకలి...."

"ఆకలి",...

"...అమ్మా...." ఈ కేకతో ఒక్కసారిగా ఈ లోకంలో వచ్చిపడింది నిర్మల. వెంటనే తలుపు తెరచుకుని వీధులోకి పరుగెత్తింది.

రాంబాబు ముందు నించొని వుంది నిర్మల. అతను నిశ్చేష్టు డయ్యాడు. నిర్మల తనకు తానుగా వస్తుందన్న నమ్మకం ఏనాడో నశించిపోయిం దతనిలో.

"నువ్వు...నువ్వా ... నువ్వేనా... నిర్మలా?" ఇది నిజమేనా? కలేమీ కాదుగదా?" ఆవేశంతో, ఆత్రుతతో ప్రశ్నించాడు రాంబాబు.

"నేను,...నేనే...నిర్మలని,"

రాంబాబు చేతులు చాచేడు—"రా, దగ్గరగా రా.. చూడు, నా వైపుచూడు," నిశ్చలంగా ఓక్షణం ఆమె వైపు చూసేడు; చూస్తూనే ఒక్క అడుగు వెనక్కు వేసేడు రాంబాబు—భయంతో వణకి పోయాడు — ఇదేమిటీ, తను ప్రేమిస్తున్న దెవరు?—అమ్మ—అమ్మనా తను ప్రేమిస్తున్నది? నిర్మల నిర్మలమైన నయనాలలో - ఆమె అందమైన ముఖంలో—ఆమె ప్రతీఅవయవంలో- అన్నింటికీ అతీతమైన, మాతృప్రేమ విరాజిల్లుతూంది. అపూర్వమైన, మాతృతేజంతో ప్రకాశిస్తున్న నిర్మల, చిననాడు తను ఎన్ని కొంటె పనులు చేసినా—దగ్గరకు తీసుకొని ప్రేమతో బుజ్జగించిన - తన తల్లిలా కనుపించింది—అతనికి "అదే ముఖం! అదే కళ్లు! అదే వాత్సల్య" పూరిత హృదయం! ఆనాడే తనను ఏకాకిని చేసి ఈలోకాన్నుంచి వెళ్లిపోయినా - ఇంకా మరచిపోలేదు తను. నిజంగా అమ్మే! మళ్లీ ఈనాడు తనను ఒదరి చేర్చడానికి దిగివచ్చిందీ లోకానికి !-"అమ్మా!.. అమ్మా!...నేనెంత పొరపాటు చేశానమ్మా!...నన్ను క్షమించవూ...?" అంటూ ఆమెకాళ్లు పట్టుకొని, చిన్నపిల్లాడిలా, వలవలా ఏడ్చేడు రాంబాబు.

రాంబాబును ఆ స్థితిలో చూసేసరికి నిర్మల హృదయం వాత్సల్యంతో ఉప్పొంగి పోయింది. అతని తలని నిమురుతూ—"లే నాయనా! ... లే...ఎందుకూ!..." అంటూ అతన్ని లేవదీస్తుంటే ఆమె కళ్ళనుండి కన్నీళ్లు జలజలా రాలి రాంబాబు శిరస్సును అభిషేకించాయి.

